


## ఇంజినీరింగ్‌లో విద్యార్థినులకు ప్రత్యేక కళాశాలలు

**గుంటూరు, న్యూస్‌టుడే :** విద్యా కేంద్రంగా భాసిల్లుతున్న గుంటూరు జిల్లాలో విద్యార్థినులకు ప్రత్యేకంగా ఇంజినీరింగ్ కళాశాలలు అందుబాటులో ఉన్నాయి. బాపట్ల మహిళా ఇంజినీరింగ్ కళాశాల, విజ్ఞాన్ నిరుల ఇంజినీరింగ్ కళాశాల, మలినేని మహిళా ఇంజినీరింగ్ కళాశాల, కృష్ణవేణి మహిళా ఇంజినీరింగ్ కళాశాల(నరసరావుపేట), కొత్తమాసు సరస్వతమ్మ, సుబ్బరత్నం మహిళా ఇంజినీరింగ్ కళాశాల (తెనాలి), ప్రియదర్శిని మహిళా ఇంజినీరింగ్ కళాశాల (చింతలపూడి, దుగ్గిరాల), మిట్టపల్లి మహిళా ఇంజినీరింగ్ కళాశాల (తుమ్మలపాలెం), సెయింట్ మేరీస్ మహిళా ఇంజినీరింగ్ కళాశాల(బుడంపాడు) కేవలం విద్యార్థినులకే కేటాయించారు. ఇందులో విభాగాల వారీగా అందుబాటులో ఉన్న సీట్ల వివరాలు ఇలా ఉన్నాయి. ఈసీఈలో 840 సీట్లు, సీఎస్ఈలో 810, ఐటీలో 570, ట్రిపుల్ ఈలో 420, సివిల్ లో 150 సీట్లు విద్యార్థినులకు అందుబాటులో ఉంటాయి.

### నిధుల సేకరణ

**ఏఎన్‌యూ, న్యూస్‌టుడే:** పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ కార్యకర్తల దాడులకు గురైన వారికి సంఘీభావంగా విశ్వవిద్యాలయం ఎస్.ఎఫ్.ఐ. అధ్యక్షుడు జగదీశ్వరరావు, ఉపాధ్యక్షులు కృష్ణారావు, తిరుపతిరావు, రాష్ట్ర కమిటీ సభ్యురాలు అనురాధ, శ్రీను, అశోక్‌లు విరాళాల ద్వారా రూ.3,115లను వసూలు చేశారు. ఈ నగదును ఎస్.ఎఫ్.ఐ. రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు ఎం.సూర్యారావుకు అందజేశారు.

### పీహెచ్‌డీలు ప్రదానం

విశ్వవిద్యాలయం అప్లయిడ్ గణితంలో ఎ.మదనమోహనరావు, తెలుగులో జె.వి.చలపతిరావులకు పీహెచ్‌డీ డిగ్రీలను ప్రదానం చేసింది. మదనమోహనరావు సీహెచ్.వి.రమణమూర్తి పర్యవేక్షణలోను, చలపతిరావు జి.వై.ప్రభావతీదేవి పర్యవేక్షణలో పరిశోధనలు పూర్తి చేశారని పరిశోధన విభాగం సమన్వయకర్త పి.నరసింహారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

### జువాలజీ 4వ సెమిస్టర్ ఫలితాలు విడుదల

విశ్వవిద్యాలయం ఈ ఏడాది ఏప్రిల్‌లో నిర్వహించిన ఎమ్మెస్సీ జువాలజీ 4వ సెమిస్టర్ పరీక్షా ఫలితాలను బుధవారం విడుదల చేసినట్లు సీఈ రామారావు తెలిపారు.

### విడుదల చేయాల్సిన ఫలితాలపై సమీక్ష

విడుదల చేయాల్సిన పీజీ కోర్సుల ఫలితాలపై ఇన్‌ఛార్జి ఉపకులపతి వియన్నారావు బుధవారం పరీక్షల విభాగం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ నెలాఖరులోపు విడుదల చేసి మార్కులు జాబితా పంపాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో పీజీ కోర్సుల సమన్వయకర్త జి.వి.చలం, సీఈ రామారావు, ఎ.ఆర్.రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు నగరంలో విద్యాసంస్థల బంద్

**అరండల్‌పేట, న్యూస్‌టుడే:** విద్యా హక్కు చట్టం అమలు, పాఠశాలలు,కళాశాలల్లో అధిక ఫీజులు వసూలును నిరసిస్తూ ఎన్.ఎస్.యు.ఐ. ఆధ్వర్యంలో గురువారం గుంటూరు నగరంలోని ప్రయివేటు పాఠశాలల బంద్ నిర్వహిస్తున్నట్లు ఎన్.ఎస్.యు.ఐ. జిల్లా కన్వీనర్ షేక్.జిలాని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకు పేద విద్యార్థులకు ప్రభుత్వ గుర్తింపు పొందిన అన్ని పాఠశాలల్లో 25 శాతం సీట్లను ఉచిత విద్యకు కేటాయించాలని డిమాండ్ చేస్తూ బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బంద్‌కు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సహకరించాలని కోరారు.